DD9 వార్త
తెలుగు దినపత్రిక
బుధవారం, అక్టోబర్ 01, 2025




- ఉమ్మడి జిల్లాలో ఘనంగా బతుకమ్మ ఉత్సవాలు
- పూల వనంగా మారిన గ్రామాలు
- ఆడిపాడిన ఆడ పడుచులు
- ఊరూరా గౌరమ్మకు ఘన వీడ్కోలు

# సద్దుల సంబురం





లోపలి పేజీల్లో..

బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో అంటూ తీరొక్క పాటలతో ఊరూవాడా మార్మోగింది. రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మలతో గ్రామాలు పూలవనంగా మారాయి. ఉమ్మడి జిల్లాలో మంగళవారం జరుపుకున్న సద్దుల బతుకమ్మ సంబురాలు అంబరాన్నంటాయి. బతుకమ్మ ఉత్సవాలకు సద్దుల బతుకమ్మతో ఘనమైన ముగింపు పలికారు. తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి సాయంత్రం గ్రామాల్లోని ప్రధాన కూడళ్ల వద్దకు చేర్చారు. సంప్రదాయ దుస్తుల్లో మహిళలు లయబద్ధంగా అడుగులేస్తూ బతుకమ్మ పాటలు పాడారు. అనంతరం గ్రామ సమీప చెరువు, కాలువల్లో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. వెళ్లిరా బతుకమ్మ.. మళ్లీ రావమ్మా.. అంటూ సాగనంపారు. అనంతరం వాయినాలు ఇచ్చిపుచ్చుకొని, వెంట తెచ్చుకున్న సద్దులను అక్కడే ఆరగించారు.

- డీడీ9 వార్త, ఖమ్మం



ప్రభుత్వ ఆసుపత్రులు అంటే ఆశలు సన్నగిల్లుతున్న సమయాన భద్రాచలం వైద్యులు ఒకే రోజు తొమ్మిది సాధారణ ప్రసవాలు చేసి విజయం సాధించి ప్రభుత్వ ఆసుపత్రి పై నమ్మకాన్ని పెంచారు.. ఇది ఆస్పత్రి చరిత్ర లోనే ఆల్ టైం రికార్డుగా నిలిచింది.. ఈ అరుదైన రికార్డుతో ప్రభుత్వ వైద్యంపై ప్రజల్లో విశ్వాసాన్ని, ధైర్యాన్ని పెంచింది. ఈ అసాధారణ విజయంతో భద్రాచలం ఆసుపత్రికి ప్రజల నుంచి విశేష ప్రశంసలు దక్కుతున్నాయి.

భద్రాచలం, (డిడి9 వార్త )

# ఆల్ టైం రికార్డు

- ఒకే రోజు తొమ్మిది సాధారణ కాన్పులు
- భద్రాచలం ప్రభుత్వ ఆసుపత్రిలో జననం
- సాధారణ ప్రసవాలు చేసిన వైద్యులు
- క్షేమంగా శిశువులు..
- విజయం సాధించిన ప్రభుత్వ వైద్యులు
- ప్రశంసలు కురిపిస్తున్న భద్రాచల వాసులు

2 లో



6 లో

# గోదారి దారేది

- జలమయమైన గ్రామాలు
- శ్మశానానికి దారి లేక పడిగాపులు
- నడుముల్లోతు బురదలో అగచాట్లు

## వర్షా కాలం వస్తే తప్పని తిప్పలు

ఎడ తెరపి లేకుండా కురుస్తున్న వర్షాలు కారణంగా లోతట్టు ప్రాంతాలన్ని జలమయమయ్యాయి.. దీంతో ఒక వ్యక్తి చనిపోతే మృతదేహాన్ని స్మశాన వాటికకు తరలించడానికి మార్గం లేక బురదతో నిండి పోయిన దారిలోనే వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది.. నడుము లోతులో అది బురదలో మృతదేహాన్ని తీడుకెళ్తున్న తీరు ప్రతి హృదయాన్ని కలిచివేసింది.. ములుగు జిల్లా వెంకటాపురం మండలంలో ఉప్పేడు వీరాపురం పంచాయితీ లో ఈ దారుణం చోటు చేసుకుంది. - వెంకటాపురం, (డిడి 9 వార్త)


# శాంతించిన గోదావరి!

- కొనసాగుతున్న రెండవ ప్రమాద హెచ్చరిక
- లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు ఆదేశం

## భద్రాద్రి వద్ద స్వల్పంగా తగ్గుతున్న వరద ఉధృతి!

గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి గోదావరి వరదలు నదీ పరివాహక ప్రాంతవాసులను తీవ్ర ఆందోళనకు గురి చేస్తున్నాయి. మంగళవారం ఉదయం నుంచీ ఉధృతంగా ప్రవహించిన గోదావరి నీటి మట్టం, రాత్రి సమయానికి స్వల్పంగా తగ్గుముఖం పట్టింది. నదీ ప్రవాహం ఇంకా రెండవ ప్రమాద హెచ్చరిక స్థాయిలోనే కొనసాగుతోంది.

భద్రాచలం, ( డిడి9 వార్త)



8 లో

# ఆల్ టైం రికార్డు



- ఒకే రోజు తొమ్మిది సాధారణ కాన్పులు
- భద్రాచలం ప్రభుత్వ ఆసుపత్రిలో జననం
- సాధారణ ప్రసవాలు చేసిన వైద్యులు
- క్షేమంగా శిశువులు..
- విజయం సాధించిన ప్రభుత్వ వైద్యులు
- ప్రశంసలు కురిపిస్తున్న భద్రాచల వాసులు

**భద్రాచలం, సెప్టెంబర్ 30, (డిడి9 వార్త ):** ప్రభుత్వ ఆసుపత్రులు అంటే ఆశలు సన్నగిల్లుతున్న సమయాన భద్రాచలం వైద్యులు ఒకే రోజు తొమ్మిది సాధారణ ప్రసవాలు చేసి విజయం సాధించి ప్రభుత్వ ఆసుపత్రి పై నమ్మకాన్ని పెంచారు.. ఇది ఆస్పత్రి చరిత్రలోనే ఆల్ టైం రికార్డుగా నిలిచింది.. వివరాల్లోకి వెళితే భద్రాచలంలో ఏరియా ఆసుపత్రి లో సోమవారం రాత్రి సద్దుల బతుకమ్మ,దేవి శరన్న వరాత్రీ శుభవేళ భద్రాచలం ఏరియా ఆసుపత్రిలో ఒకే రోజు రాత్రి ఏకంగా తొమ్మిది సాధారణ కాన్పులు చేసి సంచలనం సృష్టించి వైద్యులు రాష్ట్రవ్యాప్తంగా వార్తల్లో నిలిచారు. ఈ అరుదైన రికార్డుతో ప్రభుత్వ వైద్యంపై ప్రజల్లో విశ్వాసాన్ని, ధైర్యాన్ని పెంచింది. ఈ అసాధారణ విజయంతో భద్రాచలం ఆసుపత్రికి ప్రజల నుంచి విశేష ప్రశంసలు దక్కుతున్నాయి.

## అసాధారణ విజయం వెనుక కృషి

ఈ రికార్డును నెలకొల్పడంలో గైనకాలజిస్ట్ డాక్టర్ రేపాక సాత్విక, మిడ్‌వైఫ్ ప్రశాంతి, నర్సింగ్ మెడికల్ ఆఫీసర్ గీతాల కృషి ఎంతో ఉందని ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. వీరు ప్రత్యేక శ్రద్ధతో సురక్షిత ప్రసవాలు నిర్వహించి తల్లీబిడ్డల క్షేమాన్ని కాపాడారు. జిల్లా కలెక్టర్, మంత్రులు, శాసనసభ్యులు సహా ప్రజలు ఈ ఘనత సాధించిన వైద్య నిపుణులను, ఆసుపత్రి సిబ్బందిని అభినందించారు.






## సాధారణ కాన్పుకే ప్రాధాన్యం : డా. రేపాక సాత్విక, గైనకాలజిస్ట్



ఒకే రోజు 9 సాధారణ కాన్పులు చేయడం చాలా సంతోషాన్ని ఇచ్చిందని గైనకాలజిస్ట్ డాక్టర్ రేపాక సాత్విక తెలిపారు. ఆ తొమ్మిది మంది తల్లులు, బిడ్డలు క్షేమంగా ఉన్నారని చెప్పారు. తొమ్మిది మందిలో ఆరుగురు ఆడ శిశువులు, ముగ్గురు మగ శిశువులు జన్మించారు. "మా ఆసుపత్రికి వచ్చే గర్భిణీలకు సాధారణ కాన్పు వలన కలిగే ఆరోగ్య విషయాలను వివరించి కౌన్సిలింగ్ ఇస్తాము. ముఖ్యంగా మొదటి కాన్పు కోసం వచ్చిన వారికి అవసరమైన వ్యాయామాలు చేయించి నార్మల్ డెలివరీ చేయడమే లక్ష్యంగా మేము, మా సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటాము" అని డాక్టర్ సాత్విక వివరించారు.

## భద్రాచలం చరిత్రలో ఇదే తొలిసారి: డాక్టర్ ముదిగొండ రామకృష్ణ



ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ ముదిగొండ రామకృష్ణ మాట్లాడుతూ, "తొమ్మిదవ నెల, సద్దుల బతుకమ్మ, దేవి శరన్నవ రాత్రుల సమయంలో ఒకే రోజు 9 నార్మల్ డెలివరీలు చేయడం భద్రాచలం చరిత్రలో మొట్టమొదటి ఘనత" అని సంతోషం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో గర్భిణీ స్త్రీలకు అల్ట్రాసౌండ్ స్కానింగ్, మందులు, అన్ని రక్త పరీక్షలు సహా మెరుగైన వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని ఆయన స్పష్టం చేశారు. అలాగే, నవజాత శిశువుల కోసం అన్ని సౌకర్యాలు ఉన్నాయని, ముందుగా సాధారణ కాన్పుకే ప్రాధాన్యత ఇస్తామని, అవసరం అనుకుంటేనే సిజేరియన్ చేస్తామని వివరించారు. ఈ మెరుగైన సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.



## ఆధునిక వసతులతో శిశు సంరక్షణ: డా. రాజశేఖర్ రెడ్డి



పుట్టిన 9 మంది నవజాత శిశువులను పరీక్షించిన పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ వై. రాజశేఖర్ రెడ్డి వారంతా ఆరోగ్యంగా ఉన్నారని తెలిపారు. జిల్లాలో మరెక్కడా లేని విధంగా భద్రాచలం ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో అత్యధిక ఆధునిక వసతులతో కూడిన 20 బెడ్స్ స్పెషల్ న్యూ బోర్న్ కేర్ యూనిట్ సౌకర్యాలు నవజాత శిశువుల కోసం అందుబాటులో ఉన్నాయని ఆయన వెల్లడించారు.



## గిరిజన యువతకు డ్రగ్స్, గంజాయిపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక శిక్షణ డేవిడ్ రాజ్

**భద్రాచలం, సెప్టెంబర్ 30 (డిడి9 వార్త):**

గిరిజన యువతను నిషేధిత గంజాయి, డ్రగ్స్ మరియు ఇతర మత్తు పదార్థాల జోలికి వెళ్లకుండా అడ్డుకోవడానికి, వారిలో చైతన్యం తీసుకురావడానికి గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నట్లు సహాయ ప్రాజెక్టు అధికారి (జనరల్) మరియు మాస్టర్ శిక్షకుడు డేవిడ్ రాజ్ తెలిపారు. ఎలాంటి చెడు అలవాట్లకు బానిసలు కాకుండా యువతకు అవగాహన కల్పించేందుకు సిమ్లా, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాల్లో ప్రత్యేక శిక్షణ తీసుకోవడం జరిగిందని ఆయన వెల్లడించారు. మంగళవారం నాడు తన ఛాంబర్‌లో గిరిజన యువతీ యువకులను నిషేధిత మత్తు పదార్థాలకు దూరంగా ఉంచడానికి తీసుకున్న శిక్షణకు సంబంధించిన అంశాలను డేవిడ్ రాజ్ వివరించారు.

**పీసా చట్టం పరిధిలో ప్రత్యేక కార్యాచరణ**

షెడ్యూల్డ్ ఏరియాలోని పీసా (Panchayats Extension to Scheduled Areas) చట్టం ప్రకారం గిరిజన యువతీ యువకులను మత్తు పదార్థాలకు దూరంగా ఉంచడానికి అవగాహన కల్పించాలని తెలంగాణ రాష్ట్ర ముఖ్య కార్యనిర్వహణ అధికారి నిఖిల ఐఏఎస్ సూచన మేరకు ఈ కార్యక్రమం చేపట్టారు. తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ (TSIRD) వారి ప్రతిపాదన, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ సూచనల మేరకు భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని ఏజెన్సీ గిరిజన గ్రామాల్లో ఈ అవగాహన కల్పించనున్నారు.

**పది రాష్ట్రాల తరపున శిక్షణ**

ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ ప్రొహిబిషన్ అండ్ సెల్ అండ్ కన్జంక్షన్ ఆఫ్ ఇన్‌టాక్సికెంట్స్ సంస్థ ఆధ్వర్యంలో సిమ్లా మరియు హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాలలో గల ఎస్ఆర్‌పీసీ మనోబ్ర శిక్షణ కేంద్రంలో ఈ కార్యక్రమం జరిగింది. గిరిజన గ్రామాలలో మత్తు పదార్థాల వలన యువకులకు కలిగే అనర్థాల గురించి తెలియజేయడానికి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఈ శిక్షణలో పది రాష్ట్రాల తరపున పాల్గొన్న మాస్టర్ శిక్షకులకు



సంస్థ ప్రతినిధులు శిక్షణ అందించారు. తెలంగాణ రాష్ట్రం తరపున శిక్షణకు ముగ్గురిని ఎంపిక చేయగా, ఐటీడీఏ భద్రాచలం తరపున తాను పాల్గొన్నట్లు డేవిడ్ రాజ్ తెలిపారు.

**త్వరలో గ్రామాల్లో అవగాహన సదస్సులు.**

త్వరలో మారుమూల ఆదివాసి గిరిజన గ్రామాలలోని యువకులకు ప్రత్యేక శిక్షణ అందించి, ప్రతి గ్రామంలో అవగాహన సదస్సులు ఏర్పాటు చేయనున్నామని ఆయన పేర్కొన్నారు. మత్తు పదార్థాల వలన కలిగే అనర్థాల గురించి గిరిజన యువతీ యువకులకు తెలియపరచడం కోసం తీసుకుంటున్న కార్యాచరణ గురించి ఆ శిక్షణలో ఐటీడీఏ తరపున పవర్ ప్రజెంటేషన్ ద్వారా తెలియజేయడం జరిగిందని ఆయన అన్నారు. ఈ శిక్షణకు తెలంగాణ తరపున టీఎస్ఐఆర్డీ సంస్థ జాయింట్ డైరెక్టర్ పద్మజారాణి మరియు ఫ్యాకల్టీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## ఐటీడీఏ డీడీ ట్రైబల్ వెల్ఫేర్ గా జి. అశోక్ బాధ్యతల స్వీకరణ

**భద్రాచలం, సెప్టెంబర్ 30 (డిడి9 వార్త):**

భద్రాచలం ఐటీడీఏ విద్యాశాఖ విభాగంలో డీడీ ట్రైబల్ వెల్ఫేర్ గా పూర్తి అదనపు బాధ్యతలను జి. అశోక్ స్వీకరించారు. ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ ఆదేశాల మేరకు ఆయన మంగళవారం ఈ బాధ్యతలు చేపట్టారు. మంగళవారం నాడు డీడీ ట్రైబల్ వెల్ఫేర్‌గా విధులు నిర్వహిస్తూ పదవీ విరమణ చేసిన మణెమ్మ ఖాళీ చేసిన స్థానంలో అశోక్ నియమితులయ్యారు. ప్రస్తుతం ఏటీడీవో కార్యాలయం, భద్రాచలంలో విధులు నిర్వహిస్తూనే, భద్రాచలం ఐటీడీఏ డీడీ ట్రైబల్ వెల్ఫేర్‌గా (పూర్తి అదనపు బాధ్యతలు) బాధ్యతలు తీసుకోవడం జరిగిందని ఆయన తెలిపారు.

జి. అశోక్ జనవరి 2012 సంవత్సరంలో ఉట్నూర్ ఐటీడీఏ డీడీ ట్రైబల్ వెల్ఫేర్ కార్యాలయంలో ఏటీడీవో (అసిస్టెంట్ ట్రైబల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్)గా విధులలో చేరారు. ఆ తర్వాత ఏటీడీవోగా ఖమ్మం, నాగర్‌కర్నూల్ జిల్లాలలో కూడా పనిచేశానని ఆయన గుర్తుచేసుకున్నారు. ప్రస్తుతం భద్రాచలం ఐటీడీఏలో ఏటీడీవోగా, ఐటీడీఏ కార్యాలయంలో పీసా విభాగంలో విధులు నిర్వహిస్తూ, తాజాగా ఇన్‌ఛార్జి డీడీ ట్రైబల్ వెల్ఫేర్‌గా బాధ్యతలు తీసుకున్నారు.

ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ.. తన విధి నిర్వహణను బాధ్యతగా స్వీకరించి, గిరిజన విద్య, సంక్షేమం కోసం శాయశక్తులా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అందుకు డీడీ ట్రైబల్ వెల్ఫేర్ కార్యాలయం ఆధీనంలో పనిచేస్తున్న హెచ్ఎంలు (ప్రధానోపాధ్యాయులు), వార్డెన్లు, ఉపాధ్యాయులు మరియు సిబ్బంది తనకు సహకరించాలని కోరారు. ఇన్‌ఛార్జి డీడీ ట్రైబల్ వెల్ఫేర్‌గా బాధ్యతలు చేపట్టిన అశోక్‌ను కార్యాలయం సిబ్బంది అభినందనలు తెలిపారు.



అనంతరం డీడీ ట్రైబల్ వెల్ఫేర్‌గా బాధ్యతలు తీసుకున్న జి. అశోక్‌ను సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డీడీ ట్రైబల్ వెల్ఫేర్ కార్యాలయం సిబ్బంది పర్యవేక్షకుడు కృష్ణార్జున, పోశాలు, రామకృష్ణారెడ్డి, నారాయణ, రమణమూర్తి, రంగయ్య, చలపతి, ప్రసాద్, జానీ, మాధవి, శ్రీధర్, అశోక్, పాండు, సాయి ప్రణయ్, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఏజెన్సీ హక్కులతో చెలగాటమా?

- **భద్రాద్రి జిల్లాలో జడ్పీటీసీ స్థానాల రిజర్వేషన్‌పై రచ్చ.**
- **మంత్రి పొంగులేటి తీరు మార్చుకోకపోతే కాంగ్రెస్ ప్రభుత్వం కుప్పకూలడం ఖాయం: ఆదివాసి పూనెం ప్రదీప్ కుమార్ హెచ్చరిక**

**భద్రాచలం , సెప్టెంబర్ 30 డిడి 9 వార్త**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఎన్నడూ లేని విధంగా ఐదవ షెడ్యూల్, ఏజెన్సీ ప్రాంత గిరిజనుల హక్కులకు విరుద్ధంగా జడ్పీటీసీ స్థానాల కేటాయింపు జరిగిందంటూ మానవ హక్కుల పరిరక్షణ సంస్థ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, ఆదివాసి నాయకులు పూనెం ప్రదీప్ కుమార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్వార్థ రాజకీయాల కోసం గిరిజన అస్తిత్వాన్ని, మనోభావాలను దెబ్బతీస్తున్నారని ఆరోపించారు.

"పొంగులేటి నీ తీరు మార్చుకో" అంటూ ఆయన బహిరంగంగా హెచ్చరిక జారీ చేశారు. ముఖ్యంగా దుమ్ముగూడెం, టేకులపల్లి మండలాల జడ్పీటీసీ స్థానాలను జనరల్‌గా కేటాయించడం వెనుక మంత్రి హస్తం ఉందనే బలమైన అనుమానం కలుగుతోందని ప్రదీప్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. తన అనుచరుడైన ఓసీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిని జడ్పీ చైర్మన్‌ను చేసేందుకే గిరిజనుల హక్కులను కాలరాస్తున్నారని ఆయన మండిపడ్డారు.

**ప్రజా ప్రతినిధులా లేక బానిసలా?**

ఈ ఒంటెద్దు పోకడలు మానుకోకపోతే గిరిజనుల ప్రతాపానికి మంత్రి, ఆయన ప్రభుత్వం కుప్పకూలిపోయే రోజు వస్తుందని ప్రదీప్ కుమార్ హెచ్చరించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో నాలుగు గిరిజన నియోజకవర్గాలు, పార్లమెంట్ స్థానం కూడా గిరిజనులదేనని గుర్తుచేశారు. "అటువంటి ప్రాంతంలో నువ్వు చక్రం తిప్పి గిరిజనుల నోట్లో మట్టి కొట్టి, మోసం చేయడంతో నీ పతనానికి నాంది పలికావని" ఆయన ఘాటుగా విమర్శించారు.

ఇంత జరుగుతున్నా జిల్లాలోని శాసన, పార్లమెంట్ సభ్యులు నోరు మెదపకపోవడంపై ప్రదీప్ కుమార్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. "వారు పొంగులేటి శ్రీనివాసరెడ్డికి బానిసలుగా ఉండి జాతికి ద్రోహం చేస్తే చరిత్ర హీనులుగా మిగిలిపోతారు. తక్షణమే వారు ముఖ్యమంత్రి దృష్టికి ఈ విషయాన్ని తీసుకువెళ్లి, గతంలో మాదిరిగా రిజర్వ్ స్థానాలుగా ఉంచేందుకు ఉద్యమించాలి, లేకపోతే వచ్చే ఎన్నికలలో భంగపాటు తప్పదు" అని హెచ్చరించారు.

**అధికారుల పాత్రపైనా విమర్శలు:**

మంత్రి పొంగులేటికి ఏజెన్సీ, మైదాన ప్రాంత తేడా కూడా తెలియదని, అధికారులు కూడా దానిని అంచనా వేయకుండా ఆయన చెప్పినట్లు చేస్తున్నారనే మాటలు ప్రజలలో వ్యక్తమవుతున్నాయని ప్రదీప్ కుమార్ పేర్కొన్నారు. కొంతమంది రాజకీయ నాయకుల స్వార్థం కోసం గిరిజన ప్రజలను, చట్టాలను అపహాస్యం చెయ్యాలని ప్రయత్నిస్తున్నారని, అందుకు తగిన మూల్యం చెల్లించుకునే రోజు దగ్గరలోనే ఉన్నదని ఆయన అన్నారు. అవసరమైతే కోర్టును ఆశ్రయించి తగు బుద్ధి చెబుతామని హెచ్చరించారు. "నీ వల్ల కాంగ్రెస్ హటావో, ఏజెన్సీ బచావో" నినాదం మొదలవుతుందని ఆయన స్పష్టం చేశారు.





# మెగా వాలీబాల్ టోర్నమెంట్

**డిడి9 వార్త (సెప్టెంబర్ 30) కన్నాయిగూడెం/ఏటూరు నాగారం:**



కన్నాయిగూడెం మండలం ముప్పనపల్లి లోమంగళవారం ఈరోజునా మంత్రి సీతక్కఆదేశాల మేరకు డీసీసీ అధ్యక్షులు పైడాకుల అశోక్ సూచనలతో యువనేత సూర్య సహకారంతో కన్నాయిగూడెం మండల కాంగ్రేస్ పిలుపుతో కన్నాయిగూడెం మండలం ముప్పనపల్లి గ్రామంలో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మెగా వాలీబాల్ టోర్నమెంట్ మంగళవారం ప్రారంభించిన కన్నాయిగూడెం మండల కాంగ్రేస్ నాయకులు.ఈ టోర్నమెంట్ కు దాతలుగా క్రీడాకారులకు డ్రెస్ కోడ్ తో పాటు వాలీబాల్ కిట్టును అధించిన చిదరీ మౌనికసుమన్ మాజీ సర్పంచ్ క్రీడాకారులకు డ్రెస్ పంపిణీ చేసారు జాడి రాంబాబు కన్నాయిగూడెం మండల కాంగ్రేస్ ఇంచార్జి డ్రస్ కోడ్ పంపిణీ చేసారు. అబ్బు సతీష్ ముప్పనపల్లి సహాయానిది వ్యవస్థాపకులు వాలీబాల్, నెట్స్ క్రీడాకారులకి పంపిణీ చెయ్యడం జరిగింది. దసరా పండగ సందర్బంగా నిర్వహిస్తున్న వాలీబాల్ టోర్నమెంట్ ని అందరూ సరదాగా ఆడాలి ఎవరు కూడా ఎటువంటి గొడవలు పెట్టుకోకూడదు గెలుపు ఓటములు సహజం.పూర్తిగా కమిటీ మాట ఫైనల్ చేసుకొని అందరు ఉల్లాసంగా ఉత్సహంగా ఆడాలి ఈ టోర్నమెంట్ ని విజయవంతం చేసుకోగలరని కోరారు ఈ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్ కి మంత్రి సీతక్క డీసీసీ అధ్యక్షులు అశోక్ యువనేత సూర్య మండల అధ్యక్షులు ఎండీ, అప్సర్ ముఖ్య అతిథులుగా రాబోతున్నారు.ఈ కార్యక్రమం మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులు చింతకుట్ల వెంకటయ్య, బీసీ సెల్ ఉపాధ్యక్షులు కటకం మల్లయ్య, యూత్ కాంగ్రేస్ మండల అధ్యక్షులు బోట నాగేష్, జె ఏ సి అధ్యక్షులు ముదురుకొల్ల బిక్షపతి, చింతకుట్ల సుమన్, దాసరి లక్ష్మి నారాయణ రఘుపతి, పాల్గొన్నారు





# భద్రాచలంలో గోదావరి ఉధృతి: నీటిమట్టం 50 అడుగులు

- **ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: సబ్ కలెక్టర్ మ్రినాల్ శ్రేష్ఠ**

**భద్రాచలం, సెప్టెంబర్ 30 డిడి9 వార్త**

ఎగువ ప్రాంతాలలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా గోదావరి వరద ఉధృతి పెరుగుతోంది. భద్రాచలం వద్ద గోదావరి నది నీటిమట్టం 50 అడుగులకు చేరి, ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తోందని భద్రాచలం సబ్ కలెక్టర్ మ్రినాల్ శ్రేష్ఠ తెలిపారు. ఈ నేపథ్యంలో భద్రాచలం పట్టణంతో పాటు ముంపు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆమె హెచ్చరించారు. మంగళవారం నాడు సబ్ కలెక్టర్ భద్రాచలంలోని గోదావరి కరకట్ట ప్రదేశాలను, వరద ఉధృతిని స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ముంపు ప్రాంతాల ప్రజలు మరియు భద్రాచలం పట్టణ ప్రజల భద్రతే తమ ప్రధాన ప్రాధాన్యత అని స్పష్టం చేశారు.



**ప్రజలకు కీలక సూచనలు:**

ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ గోదావరిలోకి దిగి స్నానం చేయరాదు. వరద నీరు ప్రవహిస్తున్న వంతెనలు, చెరువులు, వాగులు, కాలువల వద్దకు వెళ్లకూడదు. శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానానికి వచ్చే భక్తులు గోదావరి పరిసర ప్రాంతాలలో, కరకట్ట, స్నాన ఘట్టాల వద్ద సరదాగా సెల్ఫీలు లేదా వీడియోలు షూట్ చేయడానికి వెళ్లి ప్రమాదాలు కొని తెచ్చుకోవద్దని సూచించారు. ప్రజలు నది తీరాలకు దూరంగా ఉండి, అధికారులు అందించే సలహాలు, సూచనలు తప్పక పాటించాలి. గోదావరి కరకట్ట ప్రదేశాలలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశామని, ప్రజలు ఎవరూ ఆ ప్రదేశాలకు వెళ్లకూడదని ఆమె విజ్ఞప్తి చేశారు.

**24 గంటలు అందుబాటులో అధికార యంత్రాంగం :**

ముంపు ప్రాంత ప్రజల కొరకు అధికారులు 24 గంటలు సేవలందించడానికి సిద్ధంగా ఉన్నారని సబ్ కలెక్టర్ తెలిపారు. వరద ఉధృతి మరింత పెరిగితే ముంపునకు గురయ్యే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడానికి పునరావాస కేంద్రాలను కూడా సిద్ధం చేయడం జరిగిందని అన్నారు.

**అత్యవసర సమాచారం కోసం సంప్రదించాల్సిన నంబర్లు:**

ఏమైనా అత్యవసర పరిస్థితులు తలెత్తినప్పుడు ఈ కింది ఫోన్ నంబర్లకు తెలియజేయాలని ఆమె కోరారు:

సబ్ కలెక్టర్ కార్యాలయం, భద్రాచలం: 08743232 444

వరదల కంట్రోల్ రూమ్: 7981219425

జిల్లా కలెక్టర్ కార్యాలయం, పాల్వంచ: 08744241950

ఐటీడీఏ కార్యాలయం, భద్రాచలం: 7995268352

ఈ కార్యక్రమంలో భద్రాచలం తాసిల్దార్ ధనియాల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



# రూ. కోటి విలువైన గంజాయి పట్టివేత

- **204 కిలోల గంజాయితో హర్యానా వ్యక్తి అరెస్టు**
- **బూర్గంపాడు ఎస్సై మేడ ప్రసాద్ బృందానికి అభినందనలు**

**బూర్గంపాడు, సెప్టెంబరు 30 (డిడి 9 వార్త )**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసులు భారీ మొత్తంలో గంజాయిని స్వాధీనం చేసుకుని, దాని అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేశారు. బూర్గంపాడు మండల పరిధిలోని మొరంపల్లి బంజర సమీపంలో బూర్గంపాడు ఎస్సై మేడ ప్రసాద్ తమ సిబ్బందితో కలిసి సోమవారం తెల్లవారుజామున నిర్వహించిన మెరుపు దాడుల్లో రూ. 1,02,46,500/ విలువ చేసే 204.930 కిలోల గంజాయిని పట్టుకున్నారు.

విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్సై బృందం చాటుగా మాటువేసి, చింతూరు నుంచి హర్యానా వైపు వెళ్తున్న HR 33B 6330 నంబరు గల కారును అదుపులోకి తీసుకున్నారు. కారుతో పాటు దాని డ్రైవర్‌ను అరెస్టు చేశారు. మంగళవారం పాల్వంచ సీఐ సతీష్ సమక్షంలో ఈ గంజాయి పట్టివేత వివరాలను మీడియాకు వెల్లడించారు.

అరెస్టయిన నిందితుడిని హర్యానా రాష్ట్రం, కురుక్షేత్రకు చెందిన కార్ డ్రైవర్ సంజీవ్ కుమార్గా (తండ్రి: జయ భగవాన్) గుర్తించారు. కార్ ఓనర్ ప్రిన్స్ కుమార్ ఆదేశాల మేరకు చింతూరుకు వెళ్లి అక్కడ ప్రధాన్ ఖారా మరియు లఖన్ హంతాల్ వద్ద గంజాయి లోడ్ చేసుకుని హర్యానా తరలిస్తున్నట్టు పోలీసులు తెలిపారు. ఎస్సై ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. ఈ గంజాయి అక్రమ రవాణాలో కీలక పాత్రధారులుగా ఉన్న ప్రిన్స్ కుమార్, ప్రధాన్ ఖారా, లఖన్ హంతాల్ ప్రస్తుతం పరారీలో ఉన్నారని పేర్కొన్నారు. గంజాయి పట్టివేతలో సమర్థత కనబరిచిన ఎస్సై మేడ ప్రసాద్, ఎస్సై నాగబిక్షం మరియు వారి సిబ్బందిని పోలీస్ ఉన్నతాధికారులు ప్రత్యేకంగా అభినందించారు. ఈ ప్రతిభకు గాను రాష్ట్రస్థాయి సోషల్ మీడియాలో సైతం "శభాష్ భద్రాద్రి జిల్లా పోలీస్" అంటూ ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.





# నిష్పక్షపాతంగా, పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించాలి

- **జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి జితేష్ వి. పాటిల్ ఆదేశం**
- **జడ్పీటీసీ, ఎంపీటీసీ, గ్రామ పంచాయతీ ఎన్నికలకు షెడ్యూల్ విడుదల**
- **ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై కఠిన చర్యలు: ఎస్పీ రోహిత్ రాజు**

**కొత్తగూడెం, సెప్టెంబరు 30 (ప్రధాన దినపత్రిక):**

జిల్లాలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలను నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి జితేష్ వి. పాటిల్ అధికారులను ఆదేశించారు. జడ్పీటీసీ, ఎంపీటీసీ, గ్రామ పంచాయతీ రెండవ సాధారణ ఎన్నికల సన్నాహక సమావేశం మంగళవారం ఐడిఓసి కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ రోహిత్ రాజుతో పాటు అదనపు కలెక్టర్లు, సబ్ కలెక్టర్, నోడల్ అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు. సమావేశంలో కలెక్టర్ జితేష్ పాటిల్ మాట్లాడుతూ, జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికలను జెడ్పీటీసీ, ఎంపీటీసీలకు రెండు విడతలుగా, గ్రామ పంచాయతీలకు మూడు విడతలుగా నిర్వహించనున్నట్లు తెలిపారు.

**ఎన్నికల షెడ్యూల్ వివరాలు**

**ఎన్నికల అంశం -- తేదీలు**

నోటిఫికేషన్, నామినేషన్ల స్వీకరణ ప్రారంభం అక్టోబర్ 9

నామినేషన్ల స్వీకరణ ముగింపు అక్టోబర్ 17

**జెడ్పీటీసీ, ఎంపీటీసీ పోలింగ్**

అక్టోబర్ 23, అక్టోబర్ 27 (రెండు విడతలుగా)

**జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఫలితాలు**

నవంబర్ 11

**గ్రామ పంచాయతీ పోలింగ్**

అక్టోబర్ 31, నవంబర్ 4, నవంబర్ 8 (మూడు విడతలుగా)

**గ్రామ పంచాయతీ ఫలితాలు**

**పోలింగ్ ముగిసిన రోజే సాయంత్రం**

జిల్లాలోని మొత్తం 22 జెడ్పీటీసీ స్థానాలు, 233 ఎంపీటీసీ స్థానాలకు రెండు విడతలుగా ఎన్నికలు జరగనున్నాయి. మొదటి విడతలో భద్రాచలం డివిజన్ పరిధిలో 602 పోలింగ్ కేంద్రాలు, రెండవ విడతలో కొత్తగూడెం డివిజన్ పరిధిలో 669 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. గ్రామ పంచాయతీ ఎన్నికలకు మొత్తం 471 గ్రామ పంచాయతీలు, 4,168 వార్డులు ఉండగా, 4,242 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయబడ్డాయి.

**కలెక్టర్, ఎస్పీ కీలక ఆదేశాలు**

కలెక్టర్ జితేష్ పాటిల్ మాట్లాడుతూ, ఎన్నికల షెడ్యూల్‌తోనే ఎన్నికల ప్రవర్తనా నియమావళి (కోడ్) అమల్లోకి వచ్చిందని స్పష్టం చేశారు. ప్రభుత్వ కార్యాలయాలు, బస్టాండ్లు, పార్కుల్లో ఉన్న రాజకీయ హోర్డింగులు, బ్యానర్లు, పోస్టర్లు తక్షణమే తొలగించాలని ఆదేశించారు. అధికారులు, సిబ్బంది ఎటువంటి రాజకీయ కార్యకలాపాల్లో పాల్గొనరాదని, ప్రభుత్వ ఆస్తులపై ఉన్న రాజకీయ రాతలను చెరిపివేయాలని సూచించారు. ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ, ఎన్నికలను శాంతియుత వాతావరణంలో నిర్వహించడం అందరి బాధ్యత అని పేర్కొన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు శాఖ పకడ్బందీ భద్రతా చర్యలు చేపడుతుందని తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద చట్టం, శాంతిభద్రతల కోసం మూడు అంచెల భద్రత ఏర్పాటు చేయబడుతుందని, అక్రమ నగదు, మద్యం పంపిణీని అరికట్టేందుకు అంతర్రాష్ట్ర సరిహద్దుల్లో చెక్ పోస్టులు ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకునేందుకు పోలీసులు పూర్తి సహకారం అందిస్తారని ఆయన తెలిపారు.

# సద్దుల బతుకమ్మ సంబరాలు



**వాజేడు, సెప్టెంబర్ 30 (డిడి9 వార్త):**

వాజేడుమండలం కొప్పుసూరు గ్రామంలో సద్దుల బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని మహిళలు, యువతులు, చిన్నారులు సంప్రదాయ వేషధారణలో, రంగురంగుల పూలతో అందంగా అలంకరించిన బతుకమ్మలను తలపై మోసుకొని ఊరేగింపుగా పాల్గొన్నారు.ః గ్రామ వీధులన్నీ బతుకమ్మ పాటలతో, పూల సువాసనతో ఉత్సవ వాతావరణంలో నిండిపోయాయి. చిన్నారులు, యువతులు, మహిళలు ఆనందభరితంగా ఆడిపాడుతూ బతుకమ్మను చుట్టుముట్టి తాళాలకు తగ్గట్టు నృత్యం చేశారు. బతుకమ్మ వేడుకలతో కొప్పుసూరు గ్రామం సాంప్రదాయపు అందాలను విరజిమ్మగా, ఐకమత్యం, ఆనందం, సాంస్కృతిక వైభవం ప్రతిధ్వనించింది.






## మోగిన స్థానిక ఎన్నికల నగార.. అమల్లోకి వచ్చిన స్థానిక సంస్థల ఎన్నికల కోడ్...

**సెప్టెంబర్ 30. డిడి 9 వార్త వెంకటాపురం.(నూగురు).**

స్థానిక సంస్థల ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లోకి వచ్చింది. ఈ క్రమంలో ములుగు జిల్లా వెంకటాపురం మండలంలో పార్టీ జెండాలు తోరణాలు తొలగించారు .రాజకీయ పార్టీలస్వర్గీయ నేతల విగ్రహాలకు ముసుగులు వేశారు. వెంకటాపురం మండల కేంద్రంలోని వేపచెట్టు సెంటర్, బస్టాండ్ సెంటర్ వద్ద ప్రముఖ నేతల విగ్రహాలకు పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ పర్యవేక్షణలో సిబ్బంది ముసుగులువేశారు ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున అనుమతులు లేకుండా ఏ రాజకీయ కార్యక్రమం నిర్వహించరాదని, ఎవరైనా కోడ్ ఉల్లంగిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు.. రాష్ట్రంలో స్థానిక ఎన్నికలు కోడ్ అమల్లోకి రావడంతో అధికారులు తనిఖీలు ప్రారంభించారు రాష్ట్ర జిల్లా రహదారులపై వాహనాలు తనిఖీచేశారు. రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధనల మేరకు ఒక వ్యక్తి రూ. 50 వేల నగదు మాత్రమే తీసుకెళ్లేందుకు అనుమతి ఉంటుంది. అంతకన్నా ఎక్కువ ఉండి సరైన పత్రాలు లేకపోతే దానిని పోలీసులు సీజ్ చేస్తారు.



# బతుకమ్మ వేడుకలో చీరలు పంపిణీ

**ములుగు ప్రతినిధి సెప్టెంబర్ 30 డి డి 9 వార్త**

మన ఆడబిడ్డలు ఎంతో ఆనందంగా జరుపుకునే సద్దుల బతుకమ్మ పండుగ సందర్భంగా

మంత్రివర్యులు ధనసరి అనసూయ సీతక్క ఆదేశాల మేరకు, జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్ సూచనలమేరకు.

ఆడబిడ్డలందరికీ సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారూ

కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి గుడ్ల దేవేందర్ సహకారంతో, మండల అధ్యక్షుడు చిటమట రఘు అధ్యక్షతనలో ఆకులవారిఘనపురం లో ఆడబిడ్డలకు చీరలు బహుమతిగా అందజేసిన ఏటూరునాగారం మండల కాంగ్రెస్ పార్టీ బృందం.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర,జిల్లా,మండల,గ్రామ సీనియర నాయకులు, ఖలీల్. గౌస్ . వెంకటేశ్వర్లు.

గంపల శివకుమార్.పోలబోయిన గోపాల్.తదితరులు పాల్గొన్నారు..





# ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు..

**సెప్టెంబర్ 30 .డి డి 9 వార్త వెంకటాపు-రం (నూగురు)**

సద్దుల బతుకమ్మ వేడుకలు మంగళవారం వెంకటాపురం మండల వ్యాప్తంగా ఘనంగా జరిగాయి. ఆడపడుచులు తీరక పూలతో బతుకమ్మను పేర్చి గౌరమ్మకు పూజలు చేశారు. ఆటపాటలు, బృంద నృత్యాలు అనంతరం జలాశయంలో నిమజ్జనం చేశారు. స్థానిక బండ్ల బజారులో సంబరాలు అంబరాన్ని అంటాయి. తీరక్క పూలతో బతుకమ్మలను సుందరంగా తీర్చి ఉవ్వెత్తున ఎగిసిపడిన ఉత్సవానికి ఆడబిడ్డలు తరలిరాగా ఊరు వాడ పట్టు పరికిణిల దగదగా వేడుకల్లో కాంతులీనింది. నిమజ్జనం వేల తెలంగాణ జానపదం గళ్ళుమంది నృత్యాలు, కోలాటాలు వెల్లువెత్తాయి.. మహిళలతో పాటు యువతులు చిన్నారులు సైతం ఉత్సవానికి తరలివచ్చారు తమ జీవితాలు కూడా రంగులమయం, పరిమళభరితం కావాలని ఆ తల్లిని వేడుకున్నారు.







# గోదారి దారేది

- **జలమయమైన గ్రామాలు**
- **శ్మశానానికి దారి లేక పడిగాపులు**
- **నడుముల్లోతు బురదలో అగచాట్లు**
- **వర్షా కాలం వస్తే తప్పని తిప్పలు**

**వెంకటాపురం ,సెప్టెంబర్ 30 (డిడి 9 వార్త):**

ఎడ తెరపి లేకుండా కురుస్తున్న వర్షాలు కారణంగా లోతట్టు ప్రాంతాలన్ని జలమయమయ్యాయి దీంతో ఒక వ్యక్తి చనిపోతే మృతదేహాన్ని స్మశాన వాటికకు తరలించడానికి మార్గం లేక బురదతో నిండి పోయిన దారిలోనే వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది నడుము లోతులో అది బురద లో మృతదేహాన్ని తీడుకెళ్తున్న తీరు ప్రతి హృదయాన్ని కలిచివేసింది,వివరాల్లోకి వెళితే ములుగు జిల్లా వెంకటాపురం మండలం ఉప్పెడువీరాపురం పంచాయతీ లోని వెంగళరావుపేటలో ఈ దారుణం చోటు చేసుకుంది ఈ గ్రామంలో స్మశాన వాటికకు వెళ్లే కనీస రహదారి లేకపోవడంతో మరణించిన మనిషి మృతదేహాన్ని తీసుకు వెళ్లడానికి గ్రామస్తులు నడుము లోతు నీళ్లలో, బురదలో మోస్తూ వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది. ఈ మార్గం పూర్తిగా వర్షం నీళ్లతో నిండిపోతూ, సుమారు రెండు అడుగుల బురదతో పూర్తిగా నడవలేని విధంగా తయారయ్యింది వృద్ధులు మహిళలు పిల్లలు ఈ మార్గంలో ప్రయాణించలేని స్థితి అలాంటిది మృతదేహాన్ని తీసుకెళ్లాలంటే ఎంత కష్టమో ఊహించుకోవచ్చు. గ్రామస్తులు అనేకసార్లు గ్రామపంచాయతీ కి మండల అధికారులకు ,సంబంధిత ప్రతినిధులను మొరపెట్టుకున్నా పట్టించుకోకపోడం లేదంటూ గ్రామస్థులు వాపోతున్నారు ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు





# సద్దుల బతుకమ్మ సంబురాలు

**వరంగల్, సెప్టెంబర్ 30, (డిడి9 వార్త)** వరంగల్ నగరంలోని లేబర్ కాలనీలో సోమవారం రాత్రి సద్దుల బతుకమ్మ పండుగను ఘనంగ నిర్వహించారు ప్రతి సంవత్సరం లాగా జరుపుకునే ఈ పండుగ ఈసారి మరింత ఉత్సాహంగా సాగింది మహిళలు, యువతులు, చిన్నారులు పూలతో అలంకరించిన బతుకమ్మలను మోసుకుని, సాంప్రదాయబద్ధంగా ఊర్లో చక్కగా ప్రదర్శించారు. కాలనీలోని ప్రధాన వీధుల్లో సద్దుల బతుకమ్మను ఏర్పాటు చేసి, ప్రతీ ఇంటి సభ్యులు, పక్కింటి కుటుంబాలు, వయసు తేడాలు లేకుండా, ఆనందంగా పూలతో నింపిన బతుకమ్మలను గద్దె దగ్గరకు తీసుకువచ్చి సమరాల్లో పాల్గొన్నారు ఈ పండుగలో మహిళలు చక్కటి వర్ణాల వస్త్రధారణలో, సాంప్రదాయ నృత్యాలు, పల్లెలో గీతలు, బతుకమ్మ పాటలు పాడుతూ, ఊరంతా ఉత్సాహంతో నింపారు, ఈ ఉత్సవాన్ని తిలకించేందుకు చుట్టుపక్కల ప్రాంతాలు వారు అందరూ హాజరయ్యి వేడుకను మరింత శోభాయమానంగా తీర్చిదిద్దారు

## అమ్మాపురం గ్రామంలో..

జనగాం, 30, (డిడి9 వార్త) : నర్మెట్ట మండలం లోని అమ్మాపురం గ్రామంలో సద్దుల బతుకమ్మ పండుగను ఊరంతా చాలా ఘనంగా జరుపుకున్నారు. గ్రామంలోని మహిళలు, యువతులు, చిన్నారులు పూలతో అలంకరించిన బతుకమ్మను మోసి, సాంప్రదాయాన్ని పూర్తి చేయడంలో ముందుగా నిలిచారు. ప్రతి ఇంటి అమ్మాయిలు, పెద్దలు క్రమంగా పూలతో బతుకమ్మను అలంకరించి, ఊరంతా పూల రసాలు, వర్ణచిత్రాల పరిమళంతో నిండిపోయింది. పల్లె వీధుల్లో నృత్యాలు, సాంప్రదాయ గీతాలు పాడుతూ, పల్లె వాసులంతా ఉత్సాహభరితంగా పాల్గొన్నారు. చిన్నపిల్లలు, యువతుల ఉత్సాహం, పెద్దల ఆనందం కలిసిన దృశ్యాలు ప్రతి ఒక్కరిని ఆకర్షించాయి.











# శాంతించిన గోదావరి!




- భద్రాద్రి వద్ద స్వల్పంగా తగ్గుతున్న వరద ఉధృతి!
- కొనసాగుతున్న రెండవ ప్రమాద హెచ్చరిక
- లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు ఆదేశం

**భద్రాచలం, సెప్టెంబరు 30 ( డిడి9 వార్త)** గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి గోదావరి వరదలు నదీ పరివాహక ప్రాంతవాసులను తీవ్ర ఆందోళనకు గురి చేస్తున్నాయి. మంగళవారం ఉదయం నుంచీ ఉధృతంగా ప్రవహించిన గోదావరి నీటి మట్టం, రాత్రి సమయానికి స్వల్పంగా తగ్గుముఖం పట్టింది. నదీ ప్రవాహం ఇంకా రెండవ ప్రమాద హెచ్చరిక స్థాయిలోనే కొనసాగుతోంది.

### – తగ్గుముఖం పట్టిన నీటి మట్టం

వరద పరిస్థితిని పరిశీలిస్తే మంగళవారం తెల్లవారుజామున 3:30 గంటలకు 48 అడుగులకు నీటి మట్టం చేరడంతో అధికారులు రెండవ ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. ఉదయం 8 గంటలకు 48.80 అడుగులకు చేరుకున్న గోదావరి, సాయంత్రం 5 గంటలకు 50 అడుగుల గరిష్ట స్థాయికి చేరింది. అయితే, అక్కడ రెండు గంటలు నిలకడగా ఉన్న తర్వాత, రాత్రి 8 గంటలకు స్వల్పంగా తగ్గి 49.90 అడుగులకు చేరుకుంది. నీటిమట్టం స్వల్పంగా తగ్గినా, ఇంకా ప్రమాదకర స్థాయిలోనే ఉండటంతో అధికార యంత్రాంగం పూర్తి అప్రమత్తంగా ఉంది.

### – కల్యాణకట్ట కింది భాగంలోకి వరద నీరు

గోదావరి వరద ఉధృతి కారణంగా భద్రాచలం దేవస్థానం కల్యాణకట్ట కింది భాగంలోకి వరద నీరు వచ్చి చేరింది. అలాగే, పవిత్ర స్నానఘట్టాలు సైతం పూర్తిగా నీట మునిగాయి. దీంతో భక్తులను స్నానాలు చేసేందుకు అధికారులు అనుమతించడం లేదు. గోదావరి ఉద్ధృత స్థాయి నుంచి ఉగ్ర రూపం దిశగా ప్రవహిస్తుండటంతో అధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నారు. అనేక లోతట్టు ప్రాంతాలకు, నదీ పరీవాహక గ్రామాలకు రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

### – అప్రమత్తంగా అధికార యంత్రాంగం

వరద ఏర్పాట్లను తహసిల్దార్ ధనియాల వెంకటేశ్వర్లు స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. స్నానఘట్టాల వద్ద భక్తులను గోదావరిలోకి వెళ్లకుండా పటిష్టంగా ఐరన్ దారులను మూసివేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నివారించేందుకు స్నానఘట్టాల వద్ద గజ ఈతగాళ్లను ఏర్పాటు చేశారు. అలాగే, ప్రమాద హెచ్చరికలకు సంబంధించిన ఫ్లెక్సీలను ఏర్పాటు చేసి ప్రజలకు, భక్తులకు అవగాహన కల్పిస్తున్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని తహసిల్దార్ వెంకటేశ్వర్లు సూచించారు. గోదావరి ప్రవాహం పూర్తిగా తగ్గే వరకు ప్రజలు సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు.



